# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు పత్రిక

సంపుటి :02  సంచిక :48  గురువారం  13-11-2025  పేజీలు:4  వెల:2/-

Website:- https://www.crimecounter.in/



క్రైమ్ కౌంటర్ NEWS
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

రిపోర్టర్లు కావలెను

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్టంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్చార్జీలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## ఢిల్లీ పేలుడుతో మళ్లీ తెరపైకి మసూద్ అజార్..



ఢిల్లీ పేలుడు ఘటనతో ఉగ్రవాది మసూద్ అజార్ పేరు మరోసారి భద్రతా సంస్థల దృష్టికి వచ్చింది. ఇంటర్నేషనల్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ఐక్యరాజ్యసమితి ప్రకటించినప్పటికీ.. పాకిస్తాన్ రక్షణలో అతడు స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ వ్యవస్థాపకుడైన ఈ మసూద్ అజార్.. పార్లమెంటుపై జరిగిన దాడితోపాటు.. ముంబై దాడులు, పఠాన్‌కోట్ దాడి, పుల్వామా ఉగ్రదాడుల వెనుక ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు. ఇక ఆపరేషన్ సిందూర్‌లో అతని కుటుంబ సభ్యులు మొత్తం హతమైనా ప్రాణాలతో బయటపడ్డాడు. ఈనెల 10వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన భారీ కారు పేలుడు దేశ భద్రతా వ్యవస్థలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి కేంద్ర నిఘా, దర్యాప్తు సంస్థలు ముమ్మర దర్యాప్తు చేస్తున్నాయి. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని.. విచారణ జరుపుతున్నాయి. ప్రమాద తీవ్రతను బట్టి.. ఈ దాడికి సంబంధించిన కారణాలను అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా.. జైషే మహ్మద్ చీఫ్, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ మసూద్ అజార్ పేరు తెరపైకి వచ్చింది. ఒకప్పుడు భారత్ అదుపులో ఉన్న మసూద్ అజార్‌ను.. అతని అనుచరులు విమానాన్ని హైజాక్ చేసి విడిపించుకుపోయారు. అప్పటి నుంచి భారత్‌పై జరిగిన అనేక ఉగ్రదాడుల వెనుక మసూద్ అజార్ మాస్టర్‌మైండ్‌గా ఉన్నాడు. మసూజ్ అజార్‌ను ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించగా.. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. 56 ఏళ్ల మసూద్ అజార్.. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ వ్యవస్థాపకుడిగా ఉన్నారు. 1999లో ఎయిరిండియా ఐసీ-814 విమానం హైజాక్ తర్వాత.. అందులో ఉన్న ప్రయాణికులను విడుదల చేసేందుకు బదులుగా భారత్ వదిలిపెట్టిన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు. మసూద్ అజార్ ప్రస్తుతం పాకిస్తాన్‌లోని బహావల్‌పూర్ నుంచి తన ఉగ్ర కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. అయితే మసూద్ అజార్ తమ దేశంలో లేడని పాకిస్తాన్ చెబుతున్నా.. ఇస్లామాబాద్ నీడలోనే స్వేచ్ఛగా తిరుగుతున్నాడని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. తాజాగా ఢిల్లీ పేలుడు కేసులో కూడా అరెస్ట్ అయిన అనుమానితులకు జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థతో లింకులు బయటపడటంతో ఆ ఉగ్రవాద సంస్థ పాత్ర మరోసారి వెలుగులోకి వచ్చింది. దశాబ్దాలుగా అనేక మంది జైషే మహమ్మద్ నాయకులు, అతని కుటుంబ సభ్యులు హతమైనా.. మసూద్ అజార్, అతని ఉగ్ర సంస్థ మాత్రం పాకిస్తాన్ మద్దతుతో బలంగానే ఉంది. మసూద్ అజార్ నేతృత్వంలోని జైషే మహ్మద్ ఉగ్రసంస్థ ఇటీవల జమాత్ ఉల్-మోమినాత్ పేరుతో ఒక మహిళా బ్రిగేడ్‌ను మొదలుపెట్టింది. మత విద్య ముసుగులో మహిళలను ఉగ్రవాద భావజాలంలోకి దించడమే లక్ష్యంగా దీన్ని చేపట్టారు. మసూద్ అజార్ సోదరి సాదియా అజ్హర్.. ఈ జమాత్ ఉల్ మోమినాత్‌కు నాయకత్వం వహిస్తోంది. 2019 పుల్వామా దాడి మాస్టర్ మైండ్ ఉమర్ ఫారూక్ భార్య అఫిరా బీబీ కూడా ఇందులో చేరింది. ఢిల్లీ పేలుడుకు సంబంధించి అరెస్ట్ అయిన ఫరీదాబాద్ మెడికల్ కాలేజీ డాక్టర్ షహీన్ సయీద్.. ఈ మహిళా బ్రిగేడ్ భారత విభాగాన్ని ఏర్పాటు చేసే పనిలో ఉన్నట్లు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తులో తేలింది.

### భారత్‌పై మసూద్ అజార్ ఉగ్రదాడులు

2001లో పార్లమెంట్‌పై ఉగ్రదాడి

2008 ముంబై దాడులు (26/11 దాడులు)

2016 పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై ఉగ్రదాడి

2019 పుల్వామా ఉగ్రదాడి



## ఇద్దరు దొంగలు అరెస్ట్, రూ. 20 లక్షల విలువైన 26 బైకులు సీజ్



క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 12 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో ):- సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ అనునిత్యం ప్రజల భద్రత ఆస్తుల రక్షణలో పటిష్టంగా పనిచేస్తుందని, జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తున్నామని, సూర్యాపేట జిల్లా ఎస్పీ కే.నరసింహ అన్నారు. ఖరీదైన బైకులు లక్ష్యంగా దొంగతనాలు చేస్తున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంలో నీ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖమ్మం ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం తెల్లవారుజామున సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకట్ , ఎస్సై సురేష్ తన టీం తో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వేమూరి కృష్ణ అనుమానాస్పదంగా వెళ్తుండగా అతనిని తనిఖీ చేశామన్నారు. నిందితుడు వేమూరి కృష్ణ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్వర్క్ సిస్టం ద్వారా అతని వేలిముద్రలు తనిఖీ చేయగా వేమూరి కృష్ణ పై స- ుమారు 150 బైక్ దొంగతనాల కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా సూర్యాపేట పట్టణం, ఖమ్మం, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా పరిధిలో, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఖరీదైన బైకులు లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి 26 మోటార్ సైకిల్ లను దొంగిలించినట్టు ఆయన ఒప్పుకున్నట్లు తెలిపారు. మోటారుసైకిల్ ల దొంగతనాలలో 06 మోటారు సైకిల్ లను ఎ -1 ఎ -2 శివకుమార్ తో కలిసి చోరీ చేసినట్లుగా అంగీకరించరాని ఆయన అన్నారు. దొంగిలించిన 26 మోటారుసైకిల్ లలో ఒక మోటారు సైకిల్ ఎ 1 కృష్ణ తన వద్ద ఉంచుకొని, మిగిలిన 25 మోటారుసైకిల్ లను ఎ 2 శివకుమార్ వద్ద ఉంచారని తెలిపారు. ఎ 2 రేఖల శివకుమార్ హెచ్డిఎఫ్సి బ్యాంక్ లో సెక్యూరిటీ గార్డ్ పనిచేస్తు, చుట్టుపక్కల వారికి హెచ్డిఎఫ్సి బ్యాంక్ వాహనాల రికవరీ ఏజెంట్ గా పనిచేస్తున్నానని చెప్పుకుంటూ, వారిని మభ్యపెడుతూ, 06 మోటారుసైకిల్ ల దొంగతనాలు ఇద్దరు కలిసి చేసినట్లుగా ఒప్పుకున్నారన్నారు. మోటారు సైకిల్ లలో 04 మోటారు సైకిల్ లను అతనికి తెలిసిన నకిరేకల్ మండలం లో వారికి అమ్మి, మిగిలిన 20 మోటారు సైకిల్ లను ఎవరికైనా అమ్ముదామని అతని ఇంటి వద్దనే ఉంచుకున్నట్లు చెప్పారన్నారు. ఎ 2 ను అదుపులోకి తీసుకొని, అతని ఇంటివద్ద ఉన్న 20 మోటారు సైకిల్ లను ఇతరులకు అమ్మిన 04 మోటారుసైకిల్ లను స్వాధీన పరచుకున్నామనీ తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని అన్నారు. ఈ సమావేశం లో డి.ఎస్.పి ప్రసన్నకుమార్, ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్సై సురేష్, పట్టణ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా కనిపించిన బీటెక్ స్టూడెంట్.



### ఆపి అతడి బ్యాగ్ చెక్ చేయగా బయటపడ్డ నివ్వెర పోయిన నిజాలు.

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 12 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో ):- గతంలో ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని ప్రొద్దుటూరు, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్‌లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి నగదు, బంగారాన్ని దొంగిలించినట్లు మల్లికార్జున్ రెడ్డి అంగీకరించాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లికార్జున్ రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. ఇంటి వద్దే ఉంటూ పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం రాలేదు. జల్సాలకు అలవాటు పడి, విలాసవంతమైన జీవితం గడపాలని భావించాడు. ఈజీ మనీ కోసం మల్లికార్జున్ రెడ్డి అడ్డదారులు తొక్కాడు. దొంగగా మారి తాళాలు వేసిన ఇళ్లు లక్ష్యంగా చేసుకుని చోరీలు చేసేవాడు. దొంగతనంతో వచ్చిన సొమ్మును విక్రయించి బెట్టింగ్ ఆడుతూ పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలో దొంగతనానికి పాల్పడ్డాడు. గ్రామంలోని ముడెం గోపిరెడ్డి ఇంటికి తాళం వేసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన మల్లికార్జున్ రెడ్డి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, రూ.90 వేల నగదు దొంగిలించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న హుజూర్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. వేపలసింగారంలో దొంగిలించిన బంగారాన్ని కరగబోసి వాటిని విక్రయించేందుకు మల్లికార్జున్ రెడ్డి మిర్యాలగూడకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో మల్లికార్జున్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. గతంలో ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని ప్రొద్దుటూరు, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్‌లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి నగదు, బంగారాన్ని దొంగిలించినట్లు మల్లికార్జున్ రెడ్డి అంగీకరించాడు. బీటెక్ చదివినా ఉద్యోగం రాకపోవడంతో లగ్జరీ లైఫ్ కోసం మల్లికార్జున్ రెడ్డి దొంగతనాలు చేస్తూ వచ్చిన డబ్బుతో బెట్టింగ్‌లు ఆడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడని సీఐ చరమందరాజు తెలిపారు. నేరస్థుడి వద్ద నుంచి 51.78 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,85,000 నగదు, బైక్, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## జర్నలిస్టు సోమయ్యకు ఘన నివాళులు..

- ఆర్థిక సాయం అందజేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి...
- కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం...



క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి వెల్దండ: - వెల్దండ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు సోమయ్య మంగళవారం మృతి చెందాడు.. దీంతో బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, కల్వకుర్తి పురపాలక మాజీ చైర్మన్ ఎడమ సత్యం, వెల్దండ మాజీ ఎంపీపీ పుట్టారామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపి వెంకటయ్య గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్,

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు.



# జర్నలిస్టు సోమయ్యకు ఘన నివాళులు..



పోతేపల్లి మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, వెల్దండ మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మార్కెట్ మాజీ డైరెక్టర్ సురమళ్ళ  సుభాష్, తలకొండపల్లి టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, వెల్దండ మండల టిఆర్ఎస్ నాయకులు జంగిలి ఆనంద్, కొండల్ యాదవ్, శ్రీను, అశోక్, ప్రభాకర్, యాదగిరి తదితరులు పరామర్శించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సోమయ్య మృతదేహానికి పూలమాలన్ని వేసి నివాళులర్పించారు. రూ .10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.కల్వకుర్తి పురపాలక మాజీ చైర్మన్ ఎడమ సత్యం రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని సోమయ్య తల్లి కి అందజేశారు. సోమయ్య కుటుంబాన్నీ టిఆర్ఎస్ పార్టీ తరపున అన్ని విధాల ఆదుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు..

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.. కీసర సంతోష రెడ్డి.

క్రైమ్ కౌంటర్ న్యూస్ మోతే, కూడలి- నరసింహపురం. నవంబర్ 12 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో) :- బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం  మోతె మండలం కూడలి - నర్సింహాపురం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి .

ఇట్టి కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య గౌడ్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు తుమ్మేటి అశోక్ రెడ్డి, భూక్యా వీర నాయక్, మరియు గ్రామ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# క్విజ్  పోటీలో చిలుకూరు విద్యార్థికి జోనల్ స్థాయిలో ప్రథమ స్థానం



క్రైమ్ కౌంటర్ న్యూస్ చిలుకూరు నవంబర్ 12 చిలుకూరు మండల రిపోర్టర్ :- సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండల కేంద్రంలోని చిలుకూరు జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి, తెలంగాణ రాష్ట్రంలో ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ మరియు టి షార్ట్ నెట్వర్క్ వారు సంయుక్తంగా విద్యార్థుల వార్షిక పోటీలు 2025 వారిలో ప్రతిభను గుర్తించేందుకు క్విజ్ వ్యాసరచన పోటీలు వకృత్వ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా జోనల్ స్థాయిలో జరిగిన పోటీల్లో విభాగంలో చిలుకూరు ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి బాల బోయిన రవి జోనల్ స్థాయిలో ప్రథమ స్థానం సంపాదించినట్లు ప్రధానోపాధ్యాయులు కర్ణాకర్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు తెలిపారు. అదేవిధంగా గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో కూడా రవి జిల్లా ఫస్ట్ మార్కులు సాధించి జిల్లా కలెక్టర్ చే ప్రశంసలు కూడా పొందినాడు. ఈ సందర్భంగా రవిని పాఠశాల సిబ్బంది గ్రామ విద్యావస్థలు గ్రామ పెద్దలు ఏపపిసి వారు, తోటి స్నేహితులు అభినందించారు.

# ప్రజల సమస్యలకు వెంటనే స్పందించిన కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి.

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 12 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో ) సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ మున్సిపల్ పరిధిలో గల లక్ష్మీపురం నుండి అనంతగిరి వెళ్లే మార్గం మధ్యలో ఉన్న కోదాడ చెరువు ఊట వాగు కొద్దిపాటి వర్షానికి అయినా పువ్వెత్తును పొంగుతూ కోదాడ -లక్ష్మీపురం, లక్ష్మీపురం - కోదాడ నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డు మార్గం మధ్యలో ఈ వాగు ఉండగా ఎప్పుడైనా కొద్దిపాటి వర్షం రాగానే భయంకరంగా వాగు ప్రవహిస్తూ ఉండటంతో ప్రజలకు ప్రయాణానికి చాలా ఇబ్బందికరంగా





ఉంటున్న సందర్భంలో లక్ష్మీపురం ప్రజలు, కోదాడ నుండి వచ్చే ప్రజలు వారి యొక్క ఇబ్బందులను మన నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి, నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతూ, రాత్రి అనక, పగలనక, నిత్యం నియోజకవర్గ ప్రజల బాగోగుల కొరకు ఆలోచిస్తూ, మన తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద  ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి సహాయ సహకారాలతో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో  రాష్ట్రంలోనే  ముందు వరుసలో ఉంచాలని ఆలోచన చేస్తున్న మన ప్రియతమ నాయకురాలు కోదాడ నియోజకవర్గం  ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి విన్నవించగా వెంటనే వారు స్పందించి  కోదాడ అనంతగిరి రోడ్డు నుండి లక్ష్మీపురం వాగు దగ్గర బ్రిడ్జిని స్వయంగా పరిశీలించి అక్కడ నుండే అధికారులతో మాట్లాడి అట్టి బ్రిడ్జిని అదే రోజున  ఎస్టిమేట్ తయారు చేపించి ఒక కోటి 80 లక్షలు రూపాయల శాంక్షన్ కొరకు సంబంధిత పంచాయతి రాజ్ మంత్రివర్యులకు సిఫార్ చేసిన కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి గారికి, కోదాడ లక్ష్మీపురం ప్రజలు హర్షద్వానులతో  వారికి ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గం స్థాయిలో వివిధ హెూదాలలో ఉన్న మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రస్తుత ప్రతినిధులు, కోదాడ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సైదిబాబు, ఎస్కే మరియు ముస్తఫా, మాతంగి బసవయ్య, మేకపోతుల సత్యనారాయణ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే షీ టీమ్స్ లక్ష్యం




కోదాడ టౌన్ పీఎస్ పరిది

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 12 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో) :- సూర్యాపేట జిల్లా ఎస్పీ శ్రీ నరసింహ, ఐపిఎస్  ఆదేశాల  మేరకు, కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో, షీ టీమ్ ఎస్ఐ మల్లేష్  బాలికా చైతన్యంలో భాగంగా ఎస్ఆర్ఎం  సంకల్ప పాఠశాల నందు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో షి టీమ్ ఎస్ఐ మల్లేశ్  మాట్లాడుతూ  మహిళలపై వేధింపులు జరిగితే షీ టీం వాట్సాప్ నెంబర్ 8712686056 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు."టీ సేఫ్" యాప్ పై మహిళలు అవగాహన కలిగియుండాలని అన్నారు. తమ ఫోటోలు గాని కుటుంబ సభ్యుల సమాచారం గాని సామాజిక మాధ్యమాలలో పెట్టకూడదని అన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీపీ లుగా పెట్టుకోవద్దని చెప్పారు.తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. సైబర్ నేరాల భారిన పడితే అధైర్య పడకుండా 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమం నందు పాఠశాల ప్రిన్సిపాల్ అభినందన్,  షీ టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ కవిత, కానిస్టేబుల్ సాయి జ్యోతి, నాగేంద్ర బాబు , పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పాలకీడు మండలాన్ని సర్వతో ముఖాభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నాను





నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి యన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

క్రైమ్ కౌంటర్ న్యూస్ పాలకవీడు నవంబర్ 12 :- పాలకీడు మండలాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నాన్నని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి యన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా   పాలకీడు మండలంలో పలు రోడ్డు  పనులకు అలాగే సబ్ స్టేషన్ నిర్మాణం పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. పాలకవీడు మండలం, మూసి ఒడ్డు సింగారంలో రూ. 01.08 కోట్లతో మూసి ఒడ్డు సింగారం నుండి రోళ్ల వారి గూడెం వరకు బీటి రోడ్డు,యల్లాపురం లో రూ. 03.02 కోట్లతో 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి అలాగే బెట్టే తండాలో రూ. 03.50 కోట్లతో బెట్టెతండ నుండి శూన్య పహాడ్ వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గిరిజనులు ఎక్కువగా ఉండే పాలకీడు మండలంలో రూ.400 కోట్లతో 10,000 ఎకరాలకు నీరు అందించే  జవహర్ జానపహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్, బెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరలో పూర్తయి గిరిజన రైతులకు సాగునీరు అందజేసి మండలాన్ని సస్యశ్యామలం చేస్తానన్ని తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వ్యవసాయ, గృహ అవసరాలకు ఎలాంటి అంతరాయము లేకుండా మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు నూతన సబ్ స్టేషన్ లు నిర్మించామని మంత్రి తెలిపారు. కష్ట కాలంలో పాలకీడు మండలం నాకు అండగా ఉందని కృతజ్ఞతగా మీ ఉత్తమన్న ఈ ప్రాంత ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేస్తాడని ఇంకా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పి కే నరసింహ, ఆర్డీఓ శ్రీనివాసులు,పీ ఆర్ ఈ ఈ వెంకటయ్య, టి జి ఎస్ పీ డి సి యల్ డి ఈ వెంకట కిష్టయ్య,తహసీల్దార్ కమలాకర్,అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు శుభవార్త..



తెలంగాణ విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పడానికి రెడీ అవుతోంది. త్వరలోనే రాష్ట్రంలో మధ్యాహ్న భోజనంలో చేపలు వడ్డించేందుకు రెడీ అవుతోంది. ఈమేరకు తెలంగాణ మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే మధ్యాహ్న భోజనంలో చేపలు పెడతామని.. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని 26 వేల నీటి వనరుల్లో చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు. ఆ వివరాలు.. తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేస్తోంది. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఉచితంగా.. మెరుగైన విద్య అందించేందుకు అనేక సంస్కరణలు అమలు చేస్తోంది. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. వీటిల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సకల సౌకర్యాలు, అత్యాధునిక వసతలు కల్పించనున్నారు. అలానే గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది. అంగన్వాడీల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇదిలా ఉండగా తాజాగా తెలంగాణ సర్కార్ విద్యార్థులకు శుభవార్త చెప్పింది. ఇకపై వారికి మధ్యాహ్న భోజనంలో చేపలు వడ్డించేందుకు రెడీ అవుతోంది. ఆ వివరాలు.. త్వరలోనే తెలంగాణలోని సర్కార్ పాఠశాలల్లో చదువుతోన్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపలు వడ్డించాలని భావిస్తున్నట్లు రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. దీనిపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి.. నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. తాజాగా మంగళవారం నాడు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ ఆక్వా కల్చర్ ఇండియా కాన్ఫరెన్స్‌కు మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో చేపలు వడ్డించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో ఒక్కసారి కూడా మత్స్యశాఖను ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వలేదని.. కానీ తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం తనకు అవకాశం కల్పించిందని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన మత్స్యశాఖను తాను పునర్నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో.. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యశాఖకు ఏకంగా రూ.123 కోట్ల బడ్జెట్ కేటాయించిందని గుర్తు చేశారు. అలానే మత్స్యకారులకు రూ.1.40 కోట్లతో బీమా కల్పించిటన్లు వెల్లడించారు.

# ఐటీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..


తెలంగాణ ప్రభుత్వం ఐటీ ఉద్యోగులకు త్వరలో శుభవార్త అందించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించి, లాస్ట్ మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి మోనో రైలు ప్రాజెక్టుపై తుది నిర్ణయం తీసుకునే అకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు స్కైవాక్‌లు నిర్మించే విషయంలోనూ ప్రభుత్వం తమ నిర్ణయం వెల్లడిస్తుందని తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం త్వరలో ఐటీ ఉద్యోగులకు శుభవార్త చెప్పనున్నట్లు తెలుస్తోంది. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించి, లాస్ట్ మైల్ కనెక్టివిటీని మెరుగుపర్చడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

## ఐటీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..



అందులో భాగంగా మోనో రైలు ప్రాజెక్టు, దాన్ని అనుసంధానించేలా స్కైవాక్‌ల నిర్మాణాల ప్రతిపాదనలపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా మొదటి దశలో 72 కిలోమీటర్ల మెట్రో కారిడార్‌ను నిర్మించారు. అయినా హైటెక్ సిటీ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, ఎయిర్‌పోర్టుకు సరైన కనెక్టివిటీ లేదు. ఈ నేపథ్యంలో ఈ మార్గాల్లో మోనో రైలు నిర్మించే ప్రతిపాదనలు వచ్చాయి. దీంతో 2018లో అప్పటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్.. గురుగ్రామ్ మోడల్ మాదిరిగా ఐటీ కారిడార్‌లో మోనో రైలు ఉపయోగకరంగా ఉంటుందా లేదా అనే విషయంపై టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించారు. అయితే అప్పటి నుంచి ఈ మోనోరైలు ప్రాజెక్టు ముందుకు కలదల్లేదు. 2023లో ప్రభుత్వం మారిన తర్వాత ప్రయారిటీలు మారిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో రెండో దశపై దృష్టి పెట్టింది. వచ్చే మూడేళ్లలో మెట్రో రైలు రెండో దశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే మెట్రో రెండో దశ కొలిక్కి వస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం మోనోరైలపై కూడా త్వరలో నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. మోనోరైల్ ప్రాజెక్ట్ కోసం పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడ్ ద్వారా నిధులు సమీకరించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని సమాచారం. వీటికి అనుబంధంగా నిర్మించే స్కైవాక్‌లకు.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు వాడుకోవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్కైవాక్‌లు వాణిజ్య భవనాల మీదుగా లేదా వాటికి దగ్గరగా వెళ్లే అవకాశం ఉన్నందున.. ఆ భవనాల యజమానుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఐటీ కారిడార్‌లోని ప్రముఖ కంపెనీలతో ప్రభుత్వం సంప్రదింపులు ప్రారంభించినట్లు ప్రభుత్వం వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ప్రభుత్వం వైపు నుంచి అధికారిక ప్రకటన వస్తే.. ఈ మోనో రైలు ప్రాజెక్టుపై స్పష్టత వస్తుంది. కాగా, ఐటీ కారిడార్‌కు మోనోరైలు వస్తే హైటెక్ సిటీలో ట్రాఫిక్ సమస్యలు తీరే అవకాశం ఉంది. దీని ద్వారా ఐటీ ఉద్యోగులకు కూడా ఉపశమనం లభిస్తుంది.

## హైదరాబాద్‌లో బాంబ్ స్క్వాడ్..



ఢిల్లీ పేలుడు ఘటనతో హైదరాబాద్ హై అలర్ట్ అయింది. దేశంలోని కీలక నగరాల్లో ఒకటైన హైదరాబాద్‌లో.. భద్రతను కట్టుదిట్టం చేసి.. తనిఖీలు చేపట్టారు. నగరవ్యాప్తంగా బాంబ్ స్క్వాడ్‌తో ముమ్మరంగా శోధిస్తున్నారు. నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ బాంబ్ స్క్వాడ్ సోదాలు సాగుతున్నాయి. ఉగ్రవాదులకు హైదరాబాద్‌తో లింకులు ఉండటం, హైదరాబాద్ పెద్ద నగరం కావడంతో.. వారి టార్గెట్ ఉంటుందని భావించి.. ముందస్తుగానే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. దేశంలో పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుడు తర్వాత.. దేశవ్యాప్తంగా భద్రతా బలగాలు, పోలీసులు అలర్ట్ అయ్యారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. షాపింగ్‌మాల్స్, బస్టాండ్లు, దేవాలయాల్లో సోదాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. రద్దీగా ఉండే మాల్స్, బస్టాప్స్, టెంపుల్స్‌లో బాంబులు ఉన్నాయా అనేది తెలుసుకునేందుకు గాలింపు చేపట్టారు. దేశంలో ఎక్కడ ఉగ్రవాద దాడులు జరిగినా.. దానికి ఏదో ఒక చిన్న లింక్ హైదరాబాద్‌కు గతంలో ఉండటంతో.. తాజాగా ఢిల్లీలో జరిగిన పేలుడుతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇక హర్యానాలోని ఫరీదాబాద్‌లో భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు పట్టుబడటం.. అదే రోజు ఢిల్లీలో పేలుడు సంభవించడంతో.. వీటికి సంబంధించి లింక్ ఉందని ఇప్పటికే నిఘా సంస్థలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలోనే దేశంలోని అన్ని నగరాల్లో హైఅలర్ట్ విధించారు. ఉగ్రవాదులు ఈ పేలుడు పదార్థాలను ఉపయోగించి.. దేశవ్యాప్తంగా పేలుళ్లకు పాల్పడాలని ప్రయత్నాలు చేస్తున్నారనే ఊహాగానాల నేపథ్యంలో.. అన్ని నగరాల్లో తనిఖీలు చేపడుతున్నారు. మరోవైపు.. ఢిల్లీ పేలుడుతో అప్రమత్తమైన హైదరాబాద్ పోలీసులు.. పాతబస్తీలోని అనుమానిత ప్రాంతాల్లో ఇప్పటికే ముమ్మరంగా తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రధానంగా హైదరాబాద్ పాతబస్తీలో కార్డన్ సెర్చ్ (నాకాబందీ)తో పాటు ఇతర రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుళ్ల దృష్ట్యా.. హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ నగరవాసులకు ఒక కీలక విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఏవైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

## మార్ఫింగ్ వీడియోలతో బ్లాక్‌మెయిల్..



సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా హైదరాబాద్ యువతిని మార్ఫింగ్ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేసి లక్షల్లో డబ్బు గుంజారు. మొదట చిన్న మొత్తానికి మొదలై.. చివరికి రూ.1.45 లక్షలు వసూలు చేశారు. పరువు పోతుందన్న భయంతో బాధితురాలు డబ్బు చెల్లించినా వేధింపులు ఆగలేదు. చివరికి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో తరహా మోసాలతో అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు సాగిస్తున్న బ్లాక్‌మెయిల్ ఉచ్చులో తాజాగా హైదరాబాద్ యువతి చిక్కుకుంది. గోషామహల్ పరిధిలోని గౌలిగూడకు చెందిన 26 ఏళ్ల యువతి బాధితురాలిగా మారింది. సైబర్ నేరగాళ్లు ఈ యువతికి సంబంధించిన మార్ఫింగ్ చేసిన అశ్లీల వీడియోలను పంపి భయపెట్టి దశలవారీగా ఆమె నుంచి రూ. 1.45 లక్షల వరకు వసూలు చేశారు. ఈ వేధింపుల పర్వం గత నెల అక్టోబర్ 10న ప్రారంభమైంది. బాధితురాలికి వాట్సాప్‌లో ఒక సందేశం వచ్చింది. అందులో ఆమె రూ.7 రుణం తీసుకున్నారని వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. ఆ మహిళ తాను ఎప్పుడూ రుణం తీసుకోలేదని ఖండించినప్పటికీ.. సైబర్ నేరగాళ్లు ఆమెకు నిరంతరం ఫోన్లు, సందేశాలు పంపిస్తూ తీవ్రంగా వేధించారు. వేధింపులు భరించలేక, బాధితురాలు ఆ మొత్తాన్ని చెల్లించింది. రూ. 7 వేలు చెల్లించిన తర్వాత కూడా నేరగాళ్ల వేధింపులు ఆగలేదు. మరింత డబ్బు లాగడానికి వారు తమ పద్ధతిని మార్చుకున్నారు. ఆమె ముఖాన్ని ఉపయోగించి తయారు చేసిన మార్ఫింగ్ చేసిన అశ్లీల వీడియోలను బాధితురాలికి పంపారు. ఆ వీడియోలను ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో షేర్ చేస్తామని బెదిరించారు. పరువు పోతుందన్న భయంతో, సామాజికంగా ఎదురయ్యే సమస్యలకు భయపడి బాధితురాలు నిస్సహాయంగా వారి డిమాండ్లకు అంగీకరించింది. ఈ విధంగా ఆమె మొత్తం రూ. 1.45 లక్షలు వారికి బదిలీ చేసింది. నిరంతర వేధింపులు, పదేపదే ఫోన్ కాల్స్ కొనసాగడంతో బాధితురాలు చివరకు తన కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని వెల్లడించింది. వారి మద్దతుతో ఆమె హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఈ నేరానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి, పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి బ్లాక్‌మెయిలింగ్‌కు గురైనప్పుడు బాధితులు వెంటనే డబ్బు చెల్లించకూడదని పోలీసులు చెబుతున్నారు. డబ్బు చెల్లిస్తే వేధింపులు మరింత పెరుగుతాయని.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా అకౌంట్ల వివరాలను దర్యాప్తునకు అందించాలని సూచిస్తున్నారు.

## హైదరాబాద్‌లోని ఆ ప్రాంతంలో గజం రూ.3.40 లక్షలు..



హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ గత కొన్నేళ్లలో భారీగా పెరిగిపోయింది. నగరంలో ఎక్కడ చూసినా గజం లక్షల్లో పలుకుతోంది. ఇక సర్కార్ భూములను విక్రయించేందుకు ప్రభుత్వం నిర్వహించే వేలంలో రికార్డు ధరలు మోగుతున్నాయి. తాజాగా రాయదుర్గంలో చదరపు గజానికి ఏకంగా రూ.3.40 లక్షలు పలికి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. అయితే 8 ఏళ్లలోనే ఆ భూమి ఏకంగా 4 రెట్లు పెరగడం గమనార్హం. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇక హైదరాబాద్ , నగర చుట్టు పక్కల జరుగుతున్న అభివృద్ధితో.. రియల్ ఎస్టేట్ రంగం అంచనాలకు మించి రికార్డులు సృష్టిస్తోంది. నగరంలో కీలక ప్రాంతాల్లో భూముల ధరలు చూస్తే.. కళ్లు తిరిగిపోవాల్సిందే. సామాన్యులే కాదు.. ధనవంతులు కూడా కొనలేని రీతిలో భూముల ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూములు కూడా.. హైదరాబాద్‌లో ఉండటంతో.. అది బంగారు బాతులా మారింది. దీంతో రాష్ట్ర ఖజానా నింపేందుకు.. ప్రభుత్వం అప్పుడప్పుడూ భూములను విక్రయిస్తూ ఉంటుంది. వేలం ద్వారా ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతుంది. తాజాగా తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన వేలంలో రికార్డు ధర పలికింది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీకి మధ్యలో ఉన్న రాయదుర్గం ప్రాంతంలో వేలం నిర్వహించగా.. కళ్లు బైర్లుకమ్మే ధర వచ్చింది. ఒక ఎకరం భూమిని వేలం వేయగా.. ఒక్కో చదరపు గజానికి రూ.3,40,000ల చొప్పున గణనీయమైన ధర పలికి.. అందర్నీ షాక్‌కు గురి చేసింది. ఒక చదరపు గజానికి రూ.3.40 లక్షల రికార్డు స్థాయ ధరతో తాజాగా నిర్వహించిన ఈ వేలం.. గత రికార్డును బద్దలు కొట్టింది. గతంలో 2017లో ఇదే ప్రాంతంలో చదరపు గజం రూ.88 వేలు పలికింది. కానీ గత 8 ఏళ్లలోనే ఆ భూమి ధర ఆకాశాన్నంటడంతో అంతా అవాక్కయ్యారు. ఈ కొత్త ధర పాత రికార్డు కంటే 4 రెట్లు ఎక్కువ కావడం విశేషం. ఈ 4 రెట్ల ధర కేవలం 8 ఏళ్లలోనే రావడం గమనార్హం. రాయదుర్గం హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో గజం రూ.3.40 లక్షలు పలికినట్లు టీజీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ కె.శశాంక వెల్లడించారు. మొత్తం 4700 గజాల స్థలాన్ని విక్రయించగా.. రూ.159.80 కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇక రాయదుర్గం భూమికి ఇంతటి భారీ ధర పలకడానికి పలు కారణాలు ఉన్నాయి. నాలెడ్జ్ సిటీలోని బొటిక్ మిక్స్‌డ్ యూజ్ ప్లాట్‌కు ఉన్న బలమైన డిమాండేనని తెలుస్తోంది. అక్కడ పరిమితంగా, అధిక నాణ్యత గల స్థలాలకు ఎంతటి అపారమైన విలువ లభిస్తుందో ఈ వేలం రుజువు చేసిందని రియల్ ఎస్టేట్ నిపుణులు పేర్కొంటున్నారు. అత్యంత ఖరీదైన ఈ వేలం.. హైదరాబాద్ నగరాన్ని అగ్రశ్రేణి పెట్టుబడి గమ్యస్థానంగా మరింత పటిష్టం చేస్తుందని చెబుతున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చినట్లు తెలిపారు.

## తెలంగాణలో వారందరికీ గుడ్‌న్యూస్..

జాతీయ స్థాయిలో తెలంగాణ సత్తా చాటాలనే ఉద్దేశంతో.. సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులకు రేవంత్ రెడ్డి సర్కార్ రూ.లక్ష ఆర్థిక సహాయం అందించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు మెయిన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులై.. ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా మరో రూ.లక్ష ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇక మెయిన్స్‌కు తెలంగాణ నుంచి 202 మంది అర్హత సాధించగా.. 40 మంది పాస్ అయి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. త్వరలోనే వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. దేశవ్యాప్తంగా అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ వంటి ఉద్యోగాల భర్తీకి సంబంధించి.. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) విడుదల చేసిన సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. దేశం మొత్తం ఈ ఏడాది ఆగస్ట్ 22వ తేదీ నుంచి ఆగస్ట్ 31వ తేదీ వరకు ఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొత్తం 2736 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు. వీరు ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ రౌండ్‌కు సెలెక్ట్ అయినట్లు యూపీఎస్సీ వెల్లడించింది. ఈ క్రమంలోనే సివిల్స్ మెయిన్స్‌లో పాస్ అయిన అభ్యర్థుల రోల్ నంబర్లు, పేర్లతో వేర్వేరుగా లిస్ట్‌లను యూపీఎస్సీ తమ వెబ్‌సైట్‌లో ఉంచింది. ఇక తాజాగా విడుదలైన సివిల్స్ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. గతేడాది నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో 202 మంది అభ్యర్థులు.. ఉత్తీర్ణులు కాగా.. వారు మెయిన్స్ రాయగా.. 43 మంది అభ్యర్థులు పాస్ అయి.. ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. అయితే సివిల్స్ రాసేవారిని ప్రోత్సహించడంలో భాగంగా తెలంగాణలోని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ఇప్పటికే ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకంలో భాగంగా.. సివిల్స్ ప్రిలిమ్స్ పాసై.. మెయిన్స్ ఎంపికైన వారికి ఒక్కొక్క అభ్యర్థికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. ఈ ఏడాది గానూ మెయిన్స్‌కు క్వాలిఫై అయిన 202 మంది అభ్యర్థులకు ఇప్పటికే రూ.లక్ష చొప్పున అందించారు. ఇప్పుడు వారిలో 43 మంది మెయిన్స్ దాటి.. ఇంటర్వ్యూలకు సెలెక్ట్ కావడంతో.. వారికి కూడా మరో రూ.లక్ష చొప్పున ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుంది. గతేడాది ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 140 మంది అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందింది. వారిలో 20 మంది మెయిన్ పరీక్షలో క్వాలిఫై అయ్యారు. ఇక ఈ ఏడాది 202 మందికి ప్రిలిమ్స్ తర్వాత సర్కార్ ఆర్థిక సహాయం ఇవ్వగా.. వారిలో 43 మంది ఇంటర్వ్యూ వరక చేరడం విశేషం. ఈ 43 మంది అభ్యర్థులకు త్వరలోనే మరో రూ.లక్ష చొప్పున సీఎం రేవంత్ రెడ్డి అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సీనియర్ సివిల్ సర్వీసెస్ అధికారులతో మాక్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంటర్వ్యూ సమయంలో ఢిల్లీలో ఉచిత వసతి అందిస్తామని పేర్కొన్నారు.

## మందాకినిగా ప్రియాంక చోప్రా..



సూపర్ స్టార్ మహేష్ బాబు, రాజమౌళి కాంబోలో వస్తున్న భారీ చిత్రం 'గ్లోబ్ ట్రాటర్' నుంచి ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్ వచ్చేసింది. మందాకినిగా ఆమె యాక్షన్ మోడ్‌లో ఆకట్టుకుంది. రాజమౌళి, ప్రియాంక తమ పాత్రల గురించి ఆసక్తికరంగా ట్వీట్ చేశారు. ఇప్పటికే పృథ్వీరాజ్ విలన్ పోస్టర్, 'సంచారీ' పాట విడుదలయ్యాయి. నవంబర్ 15న జరిగే ఈవెంట్‌లో మహేష్ ఫస్ట్ లుక్, గ్లింప్స్ విడుదల కానున్నాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ అడ్వెంచర్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలు పోషించారు. '%యూవీదీ% 29', 'గ్లోబ్ ట్రాటర్' వంటి వర్కింగ్ టైటిల్స్‌తో పిలవబడుతున్న ఈ సినిమా ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. తాజాగా ఈ మూవీ నుంచి మరో సర్‌ప్రైజ్ వచ్చింది. ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్ ను మేకర్స్ లాంచ్ చేశారు. స్ స్ ఎం బి 29 సినిమాలో మందాకిని అనే పాత్రలో ప్రియాంక చోప్రాని పరిచయం చేశారు. ఫస్ట్ లుక్‌లో ఆమె చీరకట్టులో గన్ పేలుస్తూ యాక్షన్ మోడ్‌లో కనిపించింది. ప్రియాంక ట్రెడిషనల్ లుక్ కి చేష్టలకు సంబంధం లేకుండా ఈ పోస్టర్ ఉంది. ఆమె క్యారక్టర్ లో ఏదో ట్విస్ట్ ఉంటుందేమో అనిపిస్తోంది. "ప్రపంచ వేదికపై భారతీయ సినిమాను పునర్నిర్వచించిన మహిళ.. దేశీ గర్ల్ ప్రియాంక చోప్రాకి తిరిగి స్వాగతం. మందాకినిలోని భిన్నమైన షేడ్స్ ని ఈ ప్రపంచానికి చూపించడానికి వేచి ఉండలేకపోతున్నా" అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. "ఆమె కంటికి కనిపించే దానికంటే గొప్పది... మందాకినికి హలో చెప్పండి" అని ప్రియాంక పేర్కొన్నారు.

క్రైం కౌంటర్

గురువారం 13 నవంబర్ 2025

## ఆ సినిమాలు ఎందుకు చేశానా అని ఇప్పుడు ఫీలౌతున్నా..



తెలుగు నటి అను ఇమ్మాన్యుయేల్ ఇకపై రొటీన్ కమర్షియల్ సినిమాలు చేయబోనని స్పష్టం చేసింది. రష్మిక మందన్నతో కలిసి నటించిన ది గర్ల్‌ఫ్రెండ్ చిత్ర ప్రమోషన్‌లో ఆమె మాట్లాడుతూ, "అవకాశాల కోసం ఆరాటపడే తత్త్వం నాది కాదు. నటిగా సంతృప్తినిచ్చే పాత్రలు మాత్రమే చేయాలనుకుంటున్నా" అని తెలిపింది. హాలీవుడ్ తరహా కథనంలో ప్రతి పాత్రకీ ప్రాధాన్యం ఉండాలనే ఆలోచనతో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉందని చెప్పింది. సమాజం మహిళలపై పెట్టే కట్టుబాట్లను విమర్శించిన అను, కొత్తగా వినిపిస్తున్న కథల్లో ఒకదానికి ఇప్పటికే ఓకే చెప్పినట్లు వెల్లడించింది. అమెరికాలో పుట్టి పెరిగిన అను ఇమ్మాన్యుయేల్ చిన్న వయసులోనే సినిమాపై ఆసక్తి పెంచుకుని 'స్వప్న సంచారి' అనే మలయాళ చిత్రంలో బాలనటిగా తొలిసారి కనిపించింది. ఆ తర్వాత మలయాళంలోనే 'యాక్షన్ హీరో బిజు' చిత్రంతో కథానాయికగా పరిచయమైంది. అక్కడి నుంచే ఆమె నటనా ప్రయాణం ఆరంభమైంది. ఆ వెంటనే తెలుగు పరిశ్రమలోకి అడుగు పెట్టి నాని సరసన 'మజ్ను' సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ చిత్రంలోని ఆమె సహజమైన నటన, అందమైన స్క్రీన్ ప్రెజెన్స్‌కు మంచి ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత 'ఆక్సిజన్', 'అజ్ఞాతవాసి', 'శైలజా రెడ్డి అల్లుడు', 'గీత గోవిందం', 'అల్లుడు అదుర్స్', 'రావణాసుర' వంటి చిత్రాల ద్వారా తన స్థానం నిలబెట్టుకుంది. కొంతకాలంగా తెలుగు తెరపై కనిపించని అను ఇటీవల రష్మిక మందన్నతో కలిసి నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో కీలక పాత్ర పోషించింది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడిన అను ఇమ్మాన్యుయేల్ తన కెరీర్ దిశ, కొత్త ఆలోచనల గురించి స్పష్టంగా వెల్లడించారు. " తనది అవకాశాల కోసం ఆరాటపడే తత్త్వం కాదని... ఇకపై రొటీన్ కమర్షియల్ సినిమాలు చేయకూడదని నిర్ణయించుకున్నానని స్పష్టం చేసింది. 'హాలీవుడ్ సినిమాల్లో హీరో, హీరోయిన్, విలన్ అనే విభజన ఉండదు. ప్రతి పాత్రకీ కథను ముందుకు నడిపే ప్రాధాన్యం ఉంటుంది. 'ది గర్ల్‌ఫ్రెండ్'లో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ కూడా అదే ప్రయత్నం చేశారు. అన్ని పాత్రలకు సమాన న్యాయం జరిగేలా కథను మలిచారు. థియేటర్‌లో సినిమా చూసినప్పుడు ప్రేక్షకులు మహిళా పాత్రలకు చప్పట్లు కొట్టడం ఎంతో ఆనందంగా అనిపించింది. అమ్మాయిల గురించి ఒక మంచి సందేశం చెప్పే సినిమా ఇది. నాది చిన్న పాత్ర అయినా తప్పకుండా చేయాలని అనిపించింది. ఇలాంటి సినిమాలు మనసుకు సంతృప్తి ఇస్తాయి. నటనలో కొత్తదనం నేర్చుకోవచ్చనే ఆలోచనతో ఈ ప్రాజెక్ట్ చేశాను. సాధారణంగా కమర్షియల్ సినిమాల్లో ఓవర్ యాక్షన్ చేయిస్తారు. కానీ ఈ పాత్ర కోసం రాహుల్ ఇచ్చిన సలహా మేరకు సహజంగా నటించాను. అందుకే తెరపై అది నిజంగా కనిపించింది" అని అను తెలిపింది. 'మహిళలకు సమాజం ఎన్నో షరతులు పెడుతుంది. ఎలా మాట్లాడాలి, ఎలాంటి దుస్తులు ధరించాలి, ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, పిల్లల్ని ఎప్పుడు కనాలి%% కానీ మగవారికి మాత్రం ఉద్యోగం, సంపాదన తప్ప మరే షరతులు ఉండవు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'నా సినీ ప్రయాణం పట్ల కొంత అసంతృప్తి ఉన్నా, నటిగా మాత్రం సంతృప్తి ఉంది. పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్, నాని, నాగచైతన్య, కార్తి, శివ కార్తికేయన్‌లాంటి స్టార్ హీరోలతో పనిచేసే అవకాశం దక్కింది. కానీ కొన్ని సినిమాలు చేయకపోయి ఉండాల్సింది అనిపిస్తోంది. కమర్షియల్ సినిమాలు నటిగా నన్ను తీర్చలేవు. ఇకపై సంతృప్తినిచ్చే, బలమైన పాత్రలతో కూడిన సినిమాలు మాత్రమే చేయాలనుకుంటున్నాను. ప్రస్తుతం కొన్న కథలు వింటున్నాను. వాటిలో ఒక ప్రాజెక్ట్ ఇప్పటికే ఫైనల్ అయింది. ఈ వివరాలను నిర్మాతలు త్వరలోనే ప్రకటిస్తారు' అని చెప్పుకొచ్చింది అను ఇమ్మాన్యుయేల్. సొంత నిర్ణయాలతో ముందుకు సాగుతున్న అను ఇప్పుడు నటనలో కొత్త దిశలో అడుగులు వేస్తోంది.

## 'కాంత' సినిమాకి లీగల్ చిక్కులు...




మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తున్న కాంత సినిమా వివాదంలో చిక్కుకుంది. లెజెండరీ తమిళ నటుడు టి. ఎం. త్యాగరాజ భాగవతార్ (%వీఖు%) జీవిత కథ ఆధారంగా రూపొందిన ఈ చిత్రంపై ఆయన మనవడు చెన్నై కోర్టులో కేసు వేశారు. సినిమాలో తన తాతగారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే సన్నివేశాలు ఉన్నాయని ఆరోపించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దుల్కర్‌తో పాటు సముద్రకని కీలక పాత్రలో కనిపించనున్నారు. నవంబర్ 14న రిలీజ్ కావాల్సిన ఈ సినిమా విడుదల ఇప్పుడు సందిగ్ధంలో పడింది. మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తున్న కాంత సినిమా వివాదంలో చిక్కుకుంది. లెజెండరీ తమిళ నటుడు టి. ఎం. త్యాగరాజ భాగవతార్ (%వీఖు%) జీవిత కథ ఆధారంగా రూపొందిన ఈ చిత్రంపై ఆయన మనవడు చెన్నై కోర్టులో కేసు వేశారు. సినిమాలో తన తాతగారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే సన్నివేశాలు ఉన్నాయని ఆరోపించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దుల్కర్‌తో పాటు సముద్రకని కీలక పాత్రలో కనిపించనున్నారు. నవంబర్ 14న రిలీజ్ కావాల్సిన ఈ సినిమా విడుదల ఇప్పుడు సందిగ్ధంలో పడింది. తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ మరోసారి ఆసక్తికరమైన బయోపిక్‌తో వచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ' కాంత ' ప్రముఖ తమిళ లెజెండ్ ఎం.కె. త్యాగరాజ భాగవతార్ జీవితకథ ఆధారంగా రూపొందింది. ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తుండగా సముద్రఖని కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నారు. ఈ సినిమాను దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి సంయుక్తంగా నిర్మించారు. నవంబర్ 14న విడుదల కావాల్సిన ఈ సినిమా తాజాగా చెన్నై కోర్టులో కేసుతో చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో తన తాతగారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా కొన్ని సన్నివేశాలు ఉన్నాయంటూ త్యాగరాజ భాగవతార్ మనవడు కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో 'కాంత' విడుదలపై అనుమానాలు నెలకొన్నాయి. మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో క్రేజ్ తెచ్చుకున్న దుల్కర్ సల్మాన్. మలయాళ స్టార్ మమ్ముట్టి వారసుడిగా సినిమాల్లోకి వచ్చినా అచ్చ తెలుగు కుర్రాడిలా మనకి దగ్గరైపోయాడు. 'మహానటి'లో ఆయన పోషించిన జెమిని గణేశన్ పాత్ర తక్కువ స్క్రీన్ టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించింది.


# 'శివ' సినిమా ఇచ్చిన షాక్ 'అవతార్' కూడా ఇవ్వలేదు..




నాగార్జున, ఆర్జీవీలతో సందీప్ రెడ్డి వంగా చిట్‌చాట్


అక్కినేని నాగార్జున, రామ్ గోపాల్ వర్మ కాంబినేషన్‌లో వచ్చిన కల్ట్ క్లాసిక్ 'శివ' 36 ఏళ్ల తర్వాత 4కే డాల్బీ అట్మాస్ ఫార్మాట్‌లో రీ-రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన చిట్ చాట్‌లో, సందీప్ రెడ్డి వంగా 'శివ' సినిమా తనపై చూపిన ప్రభావాన్ని, భారతీయ సినిమాపై దాని ప్రభావం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అక్కినేని నాగార్జున - డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ కాంబినేషన్‌లో వచ్చిన కల్ట్ క్లాసిక్ మూవీ 'శివ'. 36 ఏళ్ల క్రితం విడుదలైన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇండియన్ సినిమా స్థితి గతులనే మార్చేసింది. అలాంటి ట్రెండ్ సెట్టర్ మరోసారి థియేటర్లలోకి రావడానికి రెడీ అయింది. నవంబర్ 14న 4%ఖ% ఫార్మాట్ లో డాల్బీ అట్మాస్ లో గ్రాండ్ రీరిలీజ్ చేసున్నారు. ఈ నేపథ్యంలో నాగ్, ఆర్జీవీలతో డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా స్పెషల్ చిట్ చాట్ నిర్వహించారు 'శివ' సినిమా సంగతులతో పాటుగా పలు ఆసక్తికరమైన విషయాలను సందీప్ వంగాతో నాగార్జున, వర్మ పంచుకున్నారు. "రాంగోపాల్ వర్మ, సందీప్ రెడ్డి వంగా లాంటి దర్శకులు ఎప్పుడో ఒకసారి పుడతారు అని ఎస్.ఎస్ రాజమౌళి ఓ స్టేజ్ మీద అన్నాడు. యానిమల్ సినిమా చూసిన తర్వాత రాజమౌళి నాకు ఫోన్ చేసి, సందీప్ ని నీతో పోల్చాను. కానీ ఇప్పుడు నా మాటలను వెనక్కి తీసుకుంటున్నా. ఎందుకంటే అతను రామ్ గోపాల్ వర్మ కా బాప్' అన్నాడు" అని ఆర్జీవీ తెలిపారు. 'శివ' సినిమా వచ్చినప్పుడు తనకి 9 ఏళ్ల వయసు అని, ఆ ఏజ్ లోనే ఆ మూవీ తనపై ఎంతో ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని సందీప్ వంగా చెప్పారు. ఇరానీ కేఫ్ లో హీరో నాగార్జున విలన్ గణేష్ ని కొట్టే సీన్ చూసి షాక్ అయ్యానని తెలిపారు. ఇండియన్ సినిమాకి 'శివ' ఇచ్చిన థిక్ షాక్.. 'అవతార్' మూవీ కూడా ఇవ్వలేదని సందీప్ వంగా అభిప్రాయ పడ్డారు. సౌండ్, కట్ ఇలా ప్రతీ దాంట్లో ఎన్నో మార్పులకు కారణమైందన్నారు. అప్పటి వరకూ వచ్చిన సినిమాల్లో ఫైట్ చేస్తే డిష్యుం అనే సౌండ్ వచ్చేదని, కానీ 'శివ'లో రియలిస్టిక్ సౌండ్ వినిపించిందని చెప్పారు.

## 'పెద్ది'లో చిరంజీవి హీరోయిన్..



రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న పెద్ది సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలోని "చికిరి చికిరి" పాటకు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. రామ్ చరణ్ ఎనర్జీ, డీఎస్పీ సంగీతం కలిసి పాటను బ్లాక్‌బస్టర్‌గా నిలిపాయి. తాజా సమాచారం ప్రకారం సీనియర్ నటి శోభన ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించనున్నారని తెలిసింది. ఉత్తరాంధ్ర నేపథ్యంలోని ఈ సినిమాలో రామ్ చరణ్ ఒక క్రీడాకారుడిగా కనిపించబోతున్నారు. వచ్చే మార్చిలో విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రం ' పెద్ది 'లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. చరణ్ గతంలో మగధీర, ఆరెంజ్, రంగస్థలం, ఆర్ఆర్ఆర్ వంటి విభిన్న కాన్సెప్ట్‌ల చిత్రాలతో నటనలో కొత్త మైలురాళ్లు సృష్టించగా ఇప్పుడు పెద్దితో మరోసారి విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'దేవర'తో తెలుగులో తొలి సినిమాతోనే బ్లాక్‌బస్టర్ అందుకున్న జాన్వీకి ఈ చిత్రం కీలకంగా మారింది. మైత్రి మూవీ మేకర్స్‌కు కీలక ఫైనాన్షియర్‌గా ఉన్న సతీష్ కిలారు ఈ సినిమాతో నిర్మాతగా సినీ పరిశ్రమలో అడుగు పెడుతున్నారు. భారీ బడ్జెట్, నాణ్యమైన టెక్నికల్ వర్క్, గ్రామీణ నేపథ్యం మేళవించిన కథతో ఈ చిత్రం టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తికర ప్రాజెక్టుగా మారింది. ఇటీవల విడుదలైన "చికిరి చికిరి" పాటతో ఈ సినిమాపై హైప్ మరింత పెరిగింది. ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలో రామ్ చరణ్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ డ్యాన్స్‌తో అభిమానులను ఆకట్టుకున్నాడు. గ్రామీణ శైలిలో, ఉత్సాహభరితమైన బీట్‌లతో రూపొందిన ఈ పాటకు సోషల్ మీడియాలో విపరీతమైన స్పందన లభిస్తోంది. యూట్యూబ్‌లో విడుదలైన గంటల్లోనే మిలియన్ల వ్యూస్‌ను సాధించింది. రామ్ చరణ్ డ్యాన్స్ ఎనర్జీ, బుచ్చి బాబు డైరెక్షన్ టచ్, విజువల్ ప్రెజెంటేషన్ అన్నీ కలిపి ఈ సాంగ్‌ను మ్యూజికల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిపాయి. ఇక తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో సీనియర్ నటి శోభన ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. గతేడాది 'కల్కి 2898ఏడీ' చిత్రం ద్వారా చాలా ఏళ్ల తర్వాత టాలీవుడ్ తెరపై కనిపించిన శోభన 'పెద్ది'లో కీలక పాత్రలో నటించనున్నారన్న సమాచారంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. శోభన పాత్ర కథలో కీలక మలుపు తీసుకువస్తుందట. ఆమె ప్రెజెన్స్ సినిమాకు ఎమోషనల్ డెప్త్‌ని ఇస్తుందని చిత్రబృందం భావిస్తోంది. మెగాస్టార్ చిరంజీవితో శోభన.. రౌడీ అల్లుడు, రుద్రవీణ చిత్రాల్లో నటించారు. టాలీవుడ్‌లో వీరిని హిట్ పెయిర్‌గా పిలుస్తారు. అలాంటి నటి రామ్‌చరణ్ చిత్రంలో నటిస్తుందన్న వార్త మెగా ఫ్యాన్స్‌కి సంబరంగా మారింది.

## రష్మికకి నేషనల్ అవార్డ్ ఇవ్వాలి..




రష్మిక మందన నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాకు సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ప్రశంసలు దక్కాయి. రష్మిక నటన 'నేషనల్ అవార్డు'కు అర్హమని, ఆమె పాత్రలో జీవించేశారని కొనియాడారు. దర్శకుడు రాహుల్ రవీంద్రన్, నటీనటులు దీక్షిత్ శెట్టి, అను ఇమ్మాన్యుయేల్, సాంకేతిక నిపుణులను కూడా దేవిశ్రీ అభినందించారు. రష్మిక మందన ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'ది గర్ల్ ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ బ్యానర్ పై అల్లు అరవింద్ సమర్పించారు. ఇందులో దీక్షిత్ శెట్టి, అను ఇమ్మాన్యుయేల్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. టాక్సిక్ రిలేషన్ షిప్ లో డార్క్ కోణాన్ని ఆవిష్కరించిన ఈ సినిమా ఇటీవలే థియేటర్లలో విడుదలైంది. ప్రేక్షకుల నుంచి దీనికి మంచి స్పందన లభించింది. రోజు రోజుకూ వసూళ్లు పెంచుకుంటూ బాక్సాఫీస్ దగ్గర డీసెంట్ నంబర్స్ రాబడుతోంది. తాజాగా ఈ సినిమాపై దేవిశ్రీ ప్రసాద్ ప్రశంసలు కురిపించారు. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా చూసిన స్టార్ మ్యూజిక్ కంపోజర్ దేవిశ్రీ ప్రసాద్.. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. మూవీ అద్భుతంగా ఉందని, రష్మిక అవార్డ్ విన్నింగ్ పెర్ఫార్మెన్స్ కనబరిచిందని కొనియాడారు. "ది గర్ల్‌ఫ్రెండ్.. ఇటీవల కాలంలో నేను మనస్ఫూర్తిగా చప్పట్లు కొట్టిన సినిమా. వావ్.. రష్మిక మందన. నువ్వు కేవలం 'నేషనల్ క్రష్' కాదు.. ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాకి నువ్వు 'నేషనల్ అవార్డు'కి అర్హురాలివి" అని దేవిశ్రీ పేర్కొన్నారు. "పుష్ప, యానిమల్, చావా, కుబేర వంటి సినిమాల్లో వర్సటైల్ పర్ఫార్మెన్స్ తో మమ్మల్ని మంత్రముగ్ధులను చేశావ్. ఇప్పుడు ఈ సినిమాలో నీ ముఖంలోని ఆ అమాయకత్వాన్ని ఇంత సులభంగా ఎలా తిరిగి తీసుకురాగలిగావు??? ఎలా చేశావో నాకు తెలుసు.. ఎందుకంటే నువ్వు ఆ పాత్రలో జీవించేశావు. ప్రతి ఎక్స్ ప్రెషన్ లో డెప్త్ మా మనసును దోచేసింది. ప్రతి అమ్మాయి, ప్రతి అబ్బాయి ఈ సినిమా చూడాలి" అని రష్మికను ది దేవిశ్రీ ప్రసాద్ ఆకాశానికి ఎత్తేశారు. "రాహుల్ రవీంద్రన్ సర్, ఇంత సున్నితమైన సినిమాను అంత అద్భుతంగా ఎలా హ్యాండిల్ చేయగలిగారు!. ఈ బ్యూఫిటుల్ ఎమోషన్ ని మాకు ఇచ్చినందుకు గీతా ఆర్ట్స్ నిర్మాతలకు ధన్యవాదాలు. ధీక్షిత్ సర్.. మీరు అద్భుతంగా నటించారు. బ్యాడ్ గై గా మీ పర్ఫార్మెన్స్ చాలా బాగుంది. అను ఇమ్మాన్యుయేల్ తన పరిణతితో కూడిన నటనతో ప్రతి అమ్మాయికి మీలాంటి ఫ్రెండ్ అవసరమని అనుకునేలా చేసింది. మొత్తం టెక్నికల్ టీమ్ కి బృందానికి అభినందనలు. హేశం బ్యూటిఫుల్ మ్యూజిక్ హేశం, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ చాలా బాగా చేశారు" అని ఎక్స్ లో దేవిశ్రీ పోస్ట్ పెట్టారు. దీనికి రష్మిక స్పందిస్తూ "సర్ గారు" అంటూ ధన్యవాదాలు చెప్పింది. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా చూసిన స్టార్ మ్యూజిక్ కంపోజర్ దేవిశ్రీ ప్రసాద్.. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. మూవీ అద్భుతంగా ఉందని, రష్మిక అవార్డ్ విన్నింగ్ పెర్ఫార్మెన్స్ కనబరిచిందని కొనియాడారు. "ది గర్ల్‌ఫ్రెండ్.. ఇటీవల కాలంలో నేను మనస్ఫూర్తిగా చప్పట్లు కొట్టిన సినిమా. వావ్.. రష్మిక మందన. నువ్వు కేవలం 'నేషనల్ క్రష్' కాదు.. ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాకి నువ్వు 'నేషనల్ అవార్డు'కి అర్హురాలివి" అని దేవిశ్రీ పేర్కొన్నారు. "పుష్ప, యానిమల్, చావా, కుబేర వంటి సినిమాల్లో వర్సటైల్ పర్ఫార్మెన్స్ తో మమ్మల్ని మంత్రముగ్ధులను చేశావ్. ఇప్పుడు ఈ సినిమాలో నీ ముఖంలోని ఆ అమాయకత్వాన్ని ఇంత సులభంగా ఎలా తిరిగి తీసుకురాగలిగావు??? ఎలా చేశావో నాకు తెలుసు.. ఎందుకంటే నువ్వు ఆ పాత్రలో జీవించేశావు. ప్రతి ఎక్స్ ప్రెషన్ లో డెప్త్ మా మనసును దోచేసింది. ప్రతి అమ్మాయి, ప్రతి అబ్బాయి ఈ సినిమా చూడాలి" అని రష్మికను ది దేవిశ్రీ ప్రసాద్ ఆకాశానికి ఎత్తేశారు.

Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at Crime Counter Office, Opp Parivarthana school, Narasaraopate Road, Sattenapalle, AP. 522403. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com